www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఇద్దరు డీఎస్పీలపై వేటు

● శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు తొలి పోస్టింగ్స్

మహిళా న్యాయవాది హత్య కేసులో
ముగ్గురికి జీవిత ఖైదు

2

ఆగని ఆగడాలు!

● హిమాలయ అగ్రిటెక్ నకిలీ బయో ఉత్పత్తుల విక్రయాలు

21 నుంచి యూజీ డిగ్రీ
వన్ టైం ఆపర్చునిటీ పరీక్షలు


నేడు నంబూరుకు
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

శనివారం | 18-1-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

73 రోజులు.. రూ. 363.25 కోట్లు

పురాల్లో పన్ను బకాయిలు రూ.363.25 కోట్లు.. 73 రోజుల్లో వసూలు చేయాలి. సెలవు దినాల్లోనూ మున్సిపల్ ఉద్యోగులు పని చేస్తే రోజుకు రూ.4.97 కోట్లు వసూలు చేయాలి. లేదంటే నూరు శాతం పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరదు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో అధికారుల పనితీరు చూస్తే నిర్దేశించిన లక్ష్యాల మేర పన్నుల వసూళ్లపై అనుమానాలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా అధికారులు అలసత్వం వీడకపోవడం వల్లే బకాయిలు పేరుకుపోతున్నాయని అర్థమవుతోంది. తాజాగా మున్సిపల్ పరిపాలన డైరెక్టర్(డీఎంఏ) నూరు శాతం పన్ను వసూలు చేయాలని పుర అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయినా వారిలో ఆశించిన మేర స్పందన కానరావడంలేదన్న ఆరోపణలున్నాయి. పన్ను వసూలు జరుగుతున్న తీరు నూరు శాతం సాధించేదిగా లేదనే చెప్పాలి. మున్సిపాల్టీలలో రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ కార్యదర్శులు ఇలా సిబ్బంది పుష్కలంగా ఉన్నా పన్ను వసూళ్లలో చతికిల పడుతున్నారన్న విమర్శలున్నాయి.



రాష్ట్రంలోనే అత్యధికంగా పన్ను వసూలుచేసిన వినుకొండ మున్సిపాలిటీ

- పురాల్లో పన్ను వసూలు సాధ్యమేనా
- రోజుకు రూ.4.97 కోట్లు వసూలు లక్ష్యం
- పన్నుల వసూళ్ల తీరుపై డీఎంఏ ఆగ్రహం
- బకాయిలపై మున్సిపల్ అధికారుల సాగదీత
- వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పన్నులు.. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు. ఆరు నెలలకు ఒకసారి ప్రజల నుంచి ఆస్తి, నీటి పన్నుల రూపంలో వసూలు చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీలదే. ఆయా పన్నులను సకాలంలో బకాయిలు లేకుండా వసూలు చేసి అభివృద్ధి పనులకు, సిబ్బంది జీతాలకు వినియోగించుకోవాలి. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పుర పాలకులు పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. పురాల్లో పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తాండవిస్తోందనేందుకు ప్రస్తుతం పేరుకుపోయిన బకాయిలే నిదర్శనం. మార్చి 31వ తేదీ కల్లా అంటే 73 రోజుల్లో రూ.363.25 కోట్లు పన్ను వసూలు చేయాలి. ఈ మేరకు పన్ను వసూలు సాధ్యమేనా అంటే.. (మిగతా 2వ పేజీలో)

సమీక్షిస్తున్నా.. సాచివేత

మార్చి 31వ తేదీ సమీపిస్తున్నా పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు సాచివేత ధోరణి అవలంబిస్తున్నారు. వసూళ్లలో అలసత్వంపై మున్సిపల్ పరిపాలన డైరెక్టర్(డీఎంఏ) ఇటీవల జరిగిన సమీక్షలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా స్పందన కానరావడంలేదు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో పన్నుల వసూలు నామమాత్రంగా కూడా లేదు. ఇక్కడ 28.03 శాతమే వసూలైంది. గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూలు 33 శాతంలోపే ఉంది.

వసూలు.. 35.04%

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆస్తి, నీటి పన్నులను మార్చి 31వ తేదీకి రూ.559.24కోట్లు వసూలు చేయాలి. శుక్రవారానికి రూ.195.99కోట్లు పన్ను వసూలు కాగా అది 35.04 శాతంగా ఉంది. ఆస్తిపన్ను రూ.465.95 కోట్లకు ఇప్పటివరకు రూ.177.08కోట్లు వసూలు చేశారు. వసూలుశాతం 38గా నమోదైంది. నీటిపన్ను వసూలు నామమాత్రంగా కూడా లేదు. రూ.93.29 కోట్లకు రూ.18.91కోట్లు మాత్రమే వసూలైంది. పన్ను వసూలు 20.27 శాతంగా ఉంది. పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానంలో ఉంది.

రూ.కోట్లలో ప్రభుత్వ బకాయిలు..

మున్సిపాల్టీలకు పన్నుల బకాయిలు పెద్దగుదిబండగా మారుతున్నాయి. ఈ బకాయిల్లో ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలవే అధికంగా ఉంటున్నాయి. కొన్ని సంస్థలు, విభాగాలు అయితే ఏళ్లుగా పన్నులు చెల్లించడంలో తాత్సారం చేస్తున్నాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధి లోని ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన పన్ను బకాయిలు రూ.20.85 కోట్లు ఉన్నాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.5.47కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయినా బకాయిల చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరు గుతున్నది.

ఆస్తి పన్ను వసూళ్లు(రూ.కోట్లలో)..

మున్సిపాలిటీ	వసూలు	వసూలు	శాతం
పల్నాడు జిల్లా :-			
నరసరావుపేట	17.86	7.14	40.01
చిలకలూరిపేట	17.21	4.82	28.03
వినుకొండ	5.14	4.56	88.58
సత్తెనపల్లి	7.71	3.21	41.61
మాచర్ల	5.98	2.71	45.33
పిడుగురాళ్ల	5.72	3.56	62.17
దాచేపల్లి	2.14	1.18	55.07
గురజాల	1.56	0.72	46.27
బాపట్ల జిల్లా :-			
రేపల్లె	5.71	3.31	57.85
బాపట్ల	13.18	4.36	33.10
అద్దంకి	5.01	3.11	61.97
చీరాల	12.41	6.82	54.92
గుంటూరు జిల్లా :-			
గుంటూరు కార్పొరేషన్	296.11	89.26	30.14
పొన్నూరు	6.12	3.39	55.40
మంగళగిరి-తాడేపల్లి	37.24	26.88	72.18
తెనాలి	26.85	12.07	44.95



మూడు జిల్లాల్లో అత్యల్పంగా పన్ను వసూలుచేసిన చిలకలూరిపేట మున్సిపాలిటీ

చెల్లింపులపై.. కసరత్తు

- పది రోజుల్లో రూ.33.77 కోట్లు మంజూరు
- ఐదేళ్ల క్రితం బకాయిలపై ప్రభుత్వం దృష్టి
- బిల్లులను అప్‌లోడ్ చేసిన డ్వామా అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఉపాధి హామీ బిల్లుల చెల్లింపులు జరగలేదు. వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసిన పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. 2019 మార్చికి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కింద గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పెద్దసంఖ్యలో ప్రగతి పనులు జరిగాయి. అయితే ఆయా బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బిల్లులను చెల్లించాలని అధికారులకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2019 మార్చికి ముందు పనులకు బిల్లుల చెల్లింపులను పది రోజుల్లో మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల డ్వామా అధికారులు పెండింగ్ బిల్లుల నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. రానున్న పది రోజుల్లో బిల్లుల చెల్లించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.33.77 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించనున్నది. ఈ క్రమంలో రూ.లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లుల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్న వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దఎత్తున ఉపాధి పనులు

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలను 2019కి ముందు నిర్మించారు. పాడి రైతులు మినీ గోకులాలను కూడా ఉపాధి హామీ పథకంలో పెద్దసంఖ్యలో నిర్మించుకున్నారు. వీటికి సంబంధించిన బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. అయినా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. పనులు చేసిన వారు బిల్లులు చెల్లించాలని కోర్టుకు కూడా వెళ్లారు. కోర్టు ఆదేశాలు జారీ చేసినా బిల్లులు చెల్లింపులు జరగలేదు. బిల్లులు నిలిచిపోవడంతో వందలాది మంది ఆర్థికంగా నష్టపోయారు. ఆయా బిల్లులను వడ్డీతో కలిపి చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఆ హామీని ప్రస్తుతం అమలు చేసేందుకు సిద్ధమైంది. పనులు చేసిన బాధిత వ్యక్తులకు ప్రభుత్వ ప్రకటన ఊరటనిచ్చింది. సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు, మినీ గోకులాలు తదితర పనులకు సంబంధించి ఇంజనీర్లు రికార్డులు నమోదు చేశారు. ఆయా ఇంజనీర్లు పనుల జాబితాలను జిల్లాల వారీగా డ్వామా పీడీలకు అందజేశారు. ఈ మేరకు పీడీలు బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా రూ.26.65 కోట్లు బకాయిలు చెల్లించాలి. గుంటూరు జిల్లాలో రూ.87 లక్షలు, బాపట్ల జిల్లాలో రూ.6.22 కోట్లు విలువైన బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



సీసీ రహదారి

రోగులేరీ?

- యూపీహెచ్‌సీల్లో సేవలు నామమాత్రం
- ఆరోగ్య కేంద్రాల వైపు కన్నెత్తి చూడని రోగులు
- అన్ని సేవలకు జీజీహెచ్ వైపే బాధితుల చూపు

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సుందరమైన భవనాలు.. అర్హత కలిగిన వైద్యులు.. సిబ్బందితో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే రోగులు మాత్రం ఆ వైపునకు తొంగి చూడటం లేదు. మెజారిటీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీ) ఓపీ దారుణంగా ఉంది. గుంటూరు నగర పరిధిలోని నల్లచెరువు, లాలాపేట ఆరోగ్య కేంద్రాలు మినహా మిగిలిన అన్ని చోట్లా రోజుకు కేవలం 15 నుంచి 25 మంది మాత్రమే రోగులు వస్తున్నారు. ఈ మధ్య కాలంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అయితే అవి ఇంకా అమలుకు నోచుకోక పోవడం గమనార్హం.

నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో గుంటూరు జిల్లాలో 47 ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో వైద్యులతో పాటు, స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది ఉంటారు. ఈ ఆరోగ్య కేంద్రాల్లో మురికివాడలు, సమీప కాలనీల్లోని ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలన్నది ముఖ్య ఉద్దేశం. అయితే ప్రభుత్వ ఉద్దేశం ఘనంగా ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ నిర్లిప్తత సామాన్యులకు శాపంగా పరిణమిస్తోంది. ఇంటి పక్కనే అర్హత కలిగిన వైద్యులు.. ఆధునికంగా వైద్యశాల ఉన్నా సామాన్యులు అటువైపు చూడడం లేదు. చిన్నా, చితక రోగాల కోసం కూడా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి లేదా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులను ఆకర్షించడంలో విఫలం కావడంతో ఆ భారం జీజీహెచ్‌పై పడుతుంది. జీజీహెచ్‌లో తెల్లారేసరికి వేలాది మంది రోగులు ఓపీ కోసం ఎదురు చూస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఐసీఎమ్ఆర్ (మిగతా 2వ పేజీలో)



రోగులు లేక వెలవెలబోతున్న తుఫాన్‌నగర్ పీహెచ్‌సీ

బృందావన్‌గార్డెన్స్‌లోని పీహెచ్‌సీ

కృష్ణానదికి మరో రక్షణ గోడ

- సీతానగరం వైపు త్వరలో నిర్మాణం
- రూ.294.20 కోట్లతో అంచనాలు సిద్ధం
- రైల్వే బ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిమీటర్లు
- జలవనరుల శాఖ ప్రతిపాదనకు మంత్రివర్గ ఆమోదం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది వరద ముంపును అరికట్టడానికి విజయవాడ వైపున రక్షణ గోడ నిర్మించినట్లుగానే గుంటూరు జిల్లాలోని సీతానగరం, తాడేపల్లి వైపు కూడా రెండో రక్షణ గోడను నిర్మించనున్నారు. గత ఏడాది సెప్టెంబరు 1న సుమారు 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజీని తాకింది. అయితే, విజయవాడ వైపు ఉన్న ప్రాంతాలపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. కానీ, సీతానగరం ఘాట్లపై నుంచి సిమెంట్ రహదారిపైకి నీరు చేరింది. ఈ నేపథ్యంలో సీతానగరంలోని రైల్వేబ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిలోమీటర్ల మేర గోడను నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదించారు. దీనికి రూ.294.20 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. తాడేపల్లి పరిధిలో బ్యారేజీకి దిగువన నదికి కుడి మార్జిన్లో 0.9 కి.మీ నుంచి 2.61 కి.మీ వరకు వరద రక్షణ గోడ(రిటైనింగ్ వాల్) పనులకు పరిపాలన అనుమతికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీంతో రెండో రక్షణ గోడ నిర్మాణానికి కొద్దినెలల్లో అడుగులు పడతాయని జలవనరులశాఖ వర్గాలు తెలిపాయి.

వరద నుంచి రక్షణ

ప్రతీ ఏటా వర్షాకాలంలో కృష్ణా నది వరద ఉధృతి కారణంగా తాడేపల్లి పరిధిలోని సుందరయ్యనగర్, మహానాడుకాలనీ తదితర ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వరద సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. విజయవాడ వద్ద నది ఎడమవైపు మార్జిన్‌లో రక్షణ గోడను నిర్మించడం వల్ల వరద వచ్చినా కృష్ణలంక, రాణీగారితోట తదితర పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడలేదు. వారికి రక్షణ లభించింది. అదే తరహాలో నదికి కుడివైపు మార్జిన్‌లో బ్యారేజ్‌కు దిగువన కూడా శాశ్వత ప్రాతిపదికన రక్షణ గోడను నిర్మించాలని పల్లపు ప్రాంతాల ప్రజలు కోరారు. వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న మంత్రి మండలి రక్షణ గోడ నిర్మాణానికి ఆమోదం తెలిపింది.



కనకదుర్గమ్మ వారధి వద్ద విజయవాడ వైపు నిర్మించిన రక్షణ గోడ

తొలగించినా.. బరితెగింపు



కోనూరు కృష్ణానదిలో నదికి అడ్డంగా నిర్మించిన రోడ్డుపై లారీలకు ఇసుక లోడింగ్

- నదిలో మళ్లీ రోడ్డేసిన ఇసుకాసురులు
- అధికారులపై అక్రమార్కుల బెదిరింపులు
- మోటార్లకు నీరందడంలేదని రైతుల గగ్గోలు
- కృష్ణమ్మను కుళ్లబొడుస్తోన్న తెలుగు తమ్ముళ్లు
- నాడు వైసీపీ.. నేడు టీడీపీ అక్రమ తవ్వకాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇసుక జోలికి వెళ్ల వద్దు.. ఉచిత ఇసుకలో ప్రభుత్వానికి అపకీర్తి తేవొద్దు.. సామాన్యులకు సులభంగా ఇసుక అందాలి.. అని పదే పదే ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. అయినా తెలుగు తము ళ్లు లక్ష్య పెట్టడంలేదు. గత నెలలో ఏకంగా కృష్ణానదిలోనే ప్రవా హానికి అడ్డుగా రోడ్డు వేసి మరీ ఇసుకను తవ్వి తరలించారు. ఆ సమయంలో నదిలోనే రోడ్డేశారు.. అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా అచ్చంపేట తహసీల్దారు తొలగించారు. అయితే ఏమాత్రం వెనక్కి తగ్గని ఇసుకాసురులు బరితెగించారు. మళ్లీ అక్కడే రోడ్డు నిర్మించుకుని నది మధ్యలోకి వెళ్లి కృష్ణమ్మను కుళ్లబొడిచి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. పార్టీ అధినేత, ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాలను, మీడియాలో కథనాలను, అధి కారుల చర్యలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వి తరలిస్తూ తెలుగు తమ్ముళ్ల జేబులు నింపుకుంటున్నారు. అధికారం మాది అడిగేదెవరు.. ఆపేదెవరు అన్న రీతిలో రెచ్చిపోతున్నారు. గత వైసీపీ హయాంలో ఇసుకను దోచుకుం టున్నారని విమర్శంచగా.. నేడు వారిని తలదన్నే రీతిలో కొందరు కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. కృష్ణాన దిలో లెక్కకు అందనంతగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇసుక దోపిడీ కోసం ఏకంగా నదిలోనే అడ్డంగా రోడ్డు నిర్మించుకుని నిరాటంకంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేసే వారు కూడా లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమార్కులపై చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయడంలేదు. నదీ గర్భాన్ని చీల్చుతూ అక్రమంగా రోడ్డు నిర్మించినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రశ్నించే సాహసం చేయని అధికారులు

చట్టాలు.. నిబంధనలకు తూట్లు పొడిచి అచ్చంపేట మండలంలోని కోనూరు వద్ద దాదాపు కిలోమీటరన్నర పొడవునా నదీ ప్రవాహానికి అడ్డంగా రోడ్డు వేశారు. నదిలో అడ్డుగా రోడ్డులా కట్ట వేయడంతో ప్రవాహం తగ్గి దిగువన వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం నుంచి కాని, ఏ అధికారి నుంచి గాని రోడ్డు వేసేందుకు అనుమతులు లేవు. కోనూరు రేవు నుంచి రోడ్డు నిర్మించి నది మధ్యలో ఉన్న ఇసుకను దోచేస్తున్నారు. అదేమని ప్రశ్నించే సాహసం కూడా అధికారులు చేయడంలేదు. రోడ్డు నిర్మాణం విషయంలో వారు గుడ్లప్పగించి చూస్తున్నారే కానీ అడ్డుకోలేదు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజాప్రతినిధుల ద్వారా కొందరు అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అక్రమంగా రీచ్‌లను ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ చేస్తున్నారు. నాడు ఇసుకాసురుడు నంబూరు శంకరరావు అని విమర్శించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తన నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



కోనూరు వద్ద కృష్ణానదిలో అక్రమంగా ఇసుక లోడుతో వెళుతున్న లారీలు

నేడు నంబూరుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్ శనివారం పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి రానున్నారు. శనివారం చేపట్టిన ' స్వచ్ఛ్ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా ఆయన నంబూరు వస్తున్నారు. తొలుత నంబూరు గ్రామానికి చెందిన సంపద సృష్టి కేంద్రం (డంపింగ్ యార్డ్)ను పరిశీలిస్తారు. అనంతరం నంబూరు పాఠశాలలో జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు.

21 నుంచి యూజీ డిగ్రీ వన్ టైం ఆపర్చునిటీ పరీక్షలు

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో యూజీ డిగ్రీ ఇయర్ ఎండ్ కోర్సులకు సంబంధించి వన్ టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద రావు శుక్రవారం తెలిపారు. బీఏ, బీకాం(జనరల్), బీకాం (రీస్ట్రక్చర్), బీకాం (ఒకేషనల్), బీబీఎం, బీసీఏ, బీఎస్సీ, బీఏవోఎల్ పరీక్షల షెడ్యూలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు గుంటూరులోని ఏసీ కళాశాల, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా కళాశాలల విద్యార్థులు ఒంగోలులోని రాఘవ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ప్రాక్టికల్, ఇంటర్నల్స్, వైవా, ప్రాజెక్ట్ వంటి పరీక్షలు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల అభ్యర్థులు హాజరు కావాలని ఆయన సూచించారు.

ఉల్లాస భరితంగా ప్రీమియర్ లీగ్ పోటీలు


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. ఆరో రోజైన శుక్రవారం నెల్లూరు, తూర్పు గోదావరి జట్లు విజయం సాధించాయి. ప్రకాశం జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 155 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 14.1 ఓవర్లలో 90 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. సాలుంకి అఖిల్ 4 ఓవర్లలో 12 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. చిత్తూరుతో జరిగిన మ్యాచ్‌లో తూర్పు గోదావరి జిల్లా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 19.5 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆలౌటయింది. టీవీ సాయిశ్రావణ్ 46 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

దాచేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురజాల గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు (40) దాచేపల్లిలో లారీ క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ రాత్రి జీతం డబ్బులు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంపై గురజాల నుంచి దాచేపల్లికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మిరియాల వెళ్తుండగా మార్గమధ్యలోని నడికుడి ఓవర్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ఈ సంఘటనలో గాయపడిన వెంకటేశ్వర్లు గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య మరియమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జిల్లాలో ఇద్దరు డీఎస్పీలపై వేటు

- శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు తొలి పోస్టింగ్స్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు డీఎస్పీలపై వేటు పడింది. వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్, సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావులపై వేటు వేశారు. సుమారు నాలుగు నెలల క్రితమే వీరు డీఎస్పీలుగా నియమితులయ్యారు. అయితే వివిధ ఆరోపణ నేపథ్యంలో వారిని వీఆర్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు పోస్టింగ్స్ ఇచ్చారు. వెస్ట్ డీఎస్పీగా కె.అరవింద్‌ను, సౌత్ డీఎస్పీగా జి.భానోదయను నియమించారు. అలాగే గురజాల డీఎస్పీగా గత నెలలోనే అటాచ్మెంట్‌పై నియమితులైన బీఎల్ నాగ జగదీష్‌ను తిరిగి గురజాలకే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు పోస్టింగ్ ఇచ్చారు.

బోరుగడ్డకు రాచమర్యాదలు ఆరోపణల నేపథ్యంలో..

వెస్ట్ డీఎస్పీగా కొద్ది నెలల క్రితం నియమితులైన జయరాం ప్రసాద్‌పై బదిలీ వేటు పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన గురజాల డీఎస్పీగా విధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను వెస్ట్ డీఎస్పీగా నియమించారు. అయితే రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు పోలీస్ కస్టడీలో రాచమర్యాదల విషయంలో అరండల్‌పేట సీఐ కె.శ్రీనివాసరావును వీఆర్‌కు బదిలీ చేయగా, మరో ముగ్గురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. కాగ ఈ వ్యవహారంలో వెస్ట్ డీఎస్పీగా ఉన్న జయరాం ప్రసాద్ సరైన పర్యవేక్షణ చేయలేదనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. దాని ఆధారంగా డీఎస్పీ జయరాం ప్రసాద్‌పై బదిలీ వేటు పడింది అయితే ఆయనకు ఇంకా పోస్టింగ్ లభించలేదు. అదేవిధంగా సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావుపై కూడా బదిలీ వేటు వేశారు. ఆయన బదిలీ కూడా పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఆయనకు సబ్ డివిజన్‌లోని ఓ సీఐకు మధ్య పొసగడం లేదని తెలుస్తోంది. ఆయన బదిలీకి ఇది కారణమై ఉంటుందని పలువురు అంటున్నారు. గతంలో ఆయనపై ఏసీబీ కేసు ఉండడంతో దానిని కూడా సాకుగా చూపించి ఉంటారని అంటున్నారు.

ఆగని ఆగడాలు!

- జిల్లాలో హిమాలయ అగ్రిటెక్ నకిలీ బయో ఉత్పత్తుల విక్రయాలు
- వినుకొండ నుంచి వచ్చి శివారు గ్రామాల్లో పాగా
- చలించని అధికార యంత్రాంగం

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు కూత వేటు దూరంలో నకిలీ బయో ఉత్పత్తులు అమ్ముతున్నా, అధికార యంత్రాంగంలో చలనం కనిపించడం లేదు. వినుకొండ ప్రాంతానికి చెందిన హిమాలయ అగ్రిటెక్ కంపెనీ ఏ విధమైన అనుమతి లేకుండా గత కొద్ది రోజులుగా గుంటూరు పరిసర గ్రామాల్లో నకిలీ మందులు విక్రయిస్తుంది. జీ-2 అనుమతి లేకుండా ఈ కంపెనీ బయో ఉత్పత్తులు విక్రయిస్తుందని వినుకొండ పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో రూ. 80 లక్షల విలువ చేసే నకిలీ బయోలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సదరు కంపెనీకి చెందిన వ్యక్తులు తమ ఉత్పత్తులను తీసుకువచ్చి రూరల్ మండలంలోని పొత్తూరు, ఓబుల్ నాయుడుపాలెం, యనమదల, నాయుడుపేట, చౌడవరం తదితర గ్రామాల్లో విక్రయాలు ప్రారంభించారు. ప్రతి రోజూ వందలాది మంది రైతులు ఈ నకిలీ మందులు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఈ నకిలీ మందుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వినుకొండకు చెందిన హిమాలయ అగ్రిటెక్ పై తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి కూడా ఫిర్యాదులు అందాయి.

గ్రామాలు మార్చుతూ వ్యాపారం

వినుకొండకు చెందిన వ్యక్తి చుట్టూ కిరాయి ముఠాలను ఏర్పాటు చేసుకొని మరీ ఈ నకిలీ బయోఉత్పత్తుల విక్రయాలను జరుపుతున్నట్టు తెలిసింది. అనుమానం వస్తే మకాం వెంటనే వేరే గ్రామానికి మార్చుతూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. కంపెనీకి చెందిన వ్యక్తికి ఫోన్ చేస్తే వాళ్లే వచ్చి రైతులను మందులు ఉన్న గోడౌన్ దగ్గరకు తీసుకెళ్లి విక్రయాలు చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ సహకరిస్తుందా..

గతేడాది డిసెంబరు 18న ఒక రైతు రూ.3,860 విలువ చేసే పురుగు మందులను వీరివద్ద కొనుగోలు చేశారు. ఇంటికి వచ్చిన తర్వాత అవి నకిలీ మందులని తేలింది. బాధితుడు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతోనే ఈ అమ్మకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేర్వేరు కేసుల్లో బంగారం చోరీ

రేపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 25 సవర్ల బంగారం చోరీ రేపల్లెలో జరిగింది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన అల్లపర్తి లావణ్య ఈ నెల 2న పుట్టింటికి వెళ్లారు. ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని ఈ క్రమంలో దొంగలు బుధవారం తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 25 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు విషయాన్ని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు

అనంతవరప్పాడులో..

వట్టిచెరుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో ప్రధాన రహదారి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఒక గృహంలో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడి విలువైన ఆభరణాలు, నగదు అపహరించుకుపోయిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం మేరకు అనంతవరప్పాడు గ్రామంలోని కడియాల హనుమంతరావుకు చెందిన డాబాలో కూలి పనుల నిమిత్తం ఏలూరు జిల్లా శ్రీపర్రు గ్రామానికి చెందిన మందల ఆనందరాజు కుటుంబం మూడేళ్లుగా నివశిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈ నెల 12న సంక్రాంతి పండగకు స్వగ్రామం ఆపర్రు వెళ్లారు. గురువారం అనంతవరప్పాడు గ్రామం చేరుకున్నారు. కాగా ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించి గృహ యజమాని హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రమా నాయక్, హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు గృహానికి చేరుకొని వివరాలు సేకరించారు. 20 గ్రాముల బంగారు తాళిబొట్టు, మంగళసూత్రం, చెవి దిద్దులు, మూడు గ్రాముల ఉంగరం, వెండి పట్టీలు, రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారి కావటం, కొత్త వారు సంచరిస్తున్నట్టు సమాచారం ఉందనీ, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు పంచాయతీ, దాతలు సహకరిస్తే నేరాలు అరికట్టవచ్చని తెలిపారు.

73 రోజులు.. రూ.363.25 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాల్ అధికారుల తీరు పరిశీలిస్తే కష్టమనిపిస్తోంది. చిలకలూరిపేట, గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూళ్లు దారుణంగా ఉంది. మంగళగిరి-తాడేపల్లి, పిడుగురాళ్ల, అద్దంకి మున్సిపాల్టీల్లో మాత్రం పన్ను వసూలు మెరుగ్గా ఉంది. ఆదాయ వనరులను పెంచుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనేందుకు పన్నుల వసూళ్లే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారుల్లో స్పందన లేదు. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులు పక్కదారి పడుతున్నాయి.

జీతాల చెల్లింపుల్లో జాప్యం..

పన్నుల వసూళ్లు, ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉండటంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వాహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేస్తున్నారు.

మద్యం మత్తులో చెలరేగిన వివాదం

- కత్తిపోట్లతో ఒకరి పరిస్థితి విషమం

వేమూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్నేహితుల మధ్య వివాదం చెలరేగింది. చివరికి కత్తిపోట్లకు దారి తీసింది. ఈ సంఘటన వేమూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేమూరు గ్రామ పరిధిలోని ధర్మాపురానికి చెందిన పోతార్లంక సుబ్రహ్మణ్యం (బుల్లబ్బాయి), అతని మిత్రుడు అద్దేపల్లి జాన్‌వెస్లీ కలిసి మద్యం తాగుతూ మత్తులో గొడవ పడ్డారు. వివాదం పెద్దది కావడంతో జాన్‌వెస్లీపై కత్తితో దాడి చేశాడు. అదే సమయంలో సమీపంలో మద్యం తాగుతున్న జాన్‌వెస్లీ సోదరుడు అద్దేపల్లి ప్రవచన్, బోరుగడ్డ డేవిడ్‌లు వెస్లీపై కత్తితో దాడి చేస్తావా అంటూ బుల్లబ్బాయిని సమీపంలో ఉన్న రాళ్లతో తీవ్రంగా గాయపరిచారు. చెవి పైభాగంలో మెదడు వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రాణపాయ స్థితిలోకి వెళ్లడంతో సమాచారం తెలుసుకున్న బంధువులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కత్తిపోట్లకు గురైన జాన్‌వెస్లీని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వేమూరు ఎస్ఐ రవికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా న్యాయవాది హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి లక్ష జరిమానా

గుంటూరు. జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాది హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి లక్ష జరిమానా విధించారు. శుక్రవారం గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. నగరంలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడిపేట 3/1లో గల గండికోట అపార్ట్‌మెంట్‌లో నివసించే గుంటూరు బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాది రాచబత్తుని సీత మహాలక్ష్మిని 2014 జూలై 17న గండికోట సుబ్బారావు, గండికోట శ్రీవాణి, కట్టా మేరీ జ్యోతి అనే ముగ్గురు కలిసి హత్య చేశారు. ప్రాసిక్యూషన్ ఆధారాలతో నేరం రుజువు చేయడంతో ఐదో జిల్లా కోర్టు న్యాయమూర్తి నీలిమ శిక్ష విధించారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. అప్పటి అరండల్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ బిలాలుద్దీన్ కేసు దర్యాప్తు నిర్వహించారు. ఈ అపార్ట్‌మెంట్‌ను ప్రధాన నిందితుడు గండికోట సుబ్బారావు నిర్మించారు. అందులో మహిళా న్యాయవాది సీతామహాలక్ష్మి మూడో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. ఈ ఫ్లాట్‌ను ఖాళీ చేయించే విషయంలో జరిగిన వివాదామే హత్యకు దారితీసింది. ఈ హత్య అప్పట్లో సంచలనం సృష్టించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

గుళ్లపల్లిలో ఘోర అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు, గడ్డివామి

చెరుకుపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని ఈఎస్ఆర్ రైస్‌మిల్లు వెనుక ఘోర అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం 7.30 సమయంలో అల్లపర్తి పుల్లారెడ్డి తండ్రి వెంకటేశ్వర్లు పూరిల్లు విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఒక దూడ మృతి చెందింది. రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక గడ్డివామి దగ్ధమైంది. ఇంటిలో గృహోపకరణాలు, రూ.12 వేల నగదు, ఒక ఉంగరం కాలిపోయాయని బాధితుడు తెలిపారు. సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తుంది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయమై వీఆర్వో రమేష్‌ను సంప్రదించగా నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

చేతికొచ్చిన కంది పంట బూడిదపాలు

- రూ. 2 లక్షల నష్టం


బూడిదగా మారిన కంది పంట

దాచేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరాన ఉన్న భట్రుపాలెం గ్రామంలో కందిపంటను కోసి కుప్పవేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు అంటించిన నిప్పుతో పంట కాస్త కాలి బూడిదగా మారింది. శుక్రవారం దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామంలో కేశావత్ సైదానాయక్, భూక్యా రమణనాయక్ 3 ఎకరాలలో కందిపంట కోశారు. పంట పొలంలో ఉన్న కందిపంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో చేతికొచ్చిన పంట కాస్త అగ్నికి ఆహుతైంది. పంట నష్టం రూ.2 లక్షలు ఉంటుందని రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నివేదిక ఆధారంగా ఎస్సైపై చర్యలు

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో ఎస్ఐ రాజ్‌కుమార్, న్యాయవాది బేతాళం ప్రకాశరావు మధ్య చోటు చేసుకున్న ఘటనలపై న్యాయ విచారణకు ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం చెప్పారు. ఈ ఘటనపై విచారణకు మరో డీఎస్పీని నియమించినట్లు తెలిపారు. విచారణ నివేదిక వచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనకు సంబంధించి ఎస్ఐ రాజ్‌కుమార్‌ను అదే రోజు వీఆర్ కు పిలిపించి, ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి డీఎస్పీని నియమించినట్లు తెలిపారు. ఎస్సై, న్యాయవాది మధ్య జరిగిన సంఘటనకు సంబంధించి నమోదైన కేసుల దర్యాప్తు నిమిత్తం ప్రస్తుతం మరొక డీఎస్పీని నియమించినట్లు తెలిపారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా ఎస్సై రాజ్‌కుమార్‌పై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయవాద మిత్రులు విషయాలను అర్థం చేసుకొని పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

తాడికొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన షేక్ షన్ను(22), ముక్కామల గ్రామానికి చెందిన రావెల యశోధరావు గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే పుట్టింటికి వెళ్లి వస్తానని భర్తను పలుమార్లు అడిగినా పంపించేవాడు కాదు. దీంతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి బంధువులకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ముక్కామల చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. మృతురాలి తల్లి షేక్ వహిద తన కుమార్తె మృతి అనుమానాస్పదంగా ఉందని గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జిత్యా నాయక్ తెలిపారు.

రోగులేరీ?

(మొదటి పేజీ తరువాయి)

(భారత వైద్య పరిశోధనా మండలి) లెక్కల ప్రకారం లక్ష జనాభా లో ఏడాదికి 10 వేల నుంచి 15 వేల ఔట్ పేషంట్లు, 5 వేల నుంచి 7 వేల వరకు ఇన్ పేషంట్లు ఉండాలి. 2023 జనాభా లెక్కల ప్రకారం గుంటూరు నగర జనాభా సుమారు 9.80 లక్షలు. ఈ లెక్కన ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండాలి. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు.

రోగానికి వైద్యానికి సంబంధం లేదు..

గుంటూరు గుజ్జనగుండ్లలోని ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం ఉదయం ఓ మహిళ చెవి, తలలో నొప్పి అని వచ్చారు. గతంలో బీపీ, షుగర్ ఉన్నట్లు మహిళ చెబుతున్నారు. డాక్టర్ మాత్రం ఆమెకు మందులు రాసి చీటీ చేతిలో పెట్టారు. ఏమి మందులు రాశారని సదరు మహిళ అడిగితే బలానికి(బీ-కాంప్లెక్స్), తల తిరుగుడు ఆగడానికి రాసినట్లు వైద్యురాలు చెప్పారు. బీపీకి, షుగర్‌కి మందులు ఎందుకు రాయలేదంటే ప్రస్తుతం అవి పూర్తి కంట్రోల్‌లో ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. అసలు మందులు వాడకపోతే రేపు మళ్లీ బీపీ, షుగర్ లెవల్స్ పెరిగే అవకాశం ఉన్నా అవేవీ పట్టించుకోకుండా డాక్టర్ బలం మందులతో సరిపెట్టడం గమనార్హం. ఇలాంటి కారణాలు వల్లే చాలామంది పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేందుకు ఇష్టపడని పరిస్థితి కనిపిస్తోన్నట్లు సమాచారం. ఏ రోగమైనా అదే పారాసిటమాల్, డైక్లోఫెనాక్, మెట్రోజెల్, సిట్రజిన్, బీకాంప్లెక్స్ మాత్రలు మాత్రమే ఇస్తున్నారు. వీటికి మించి మరేమీ ఇవ్వకపోవడంతో ఆ మందులకు రోగం తగ్గదన్న భావన ప్రబలుతున్నట్లు కనిపిస్తుంది. పైగా చిన్న చిన్న రోగాలకు ఇక్కడ వైద్యం అందుతుందన్న ప్రచారం కూడా మురికివాడలు, కాలనీల్లో సరిగా జరగక పోవడం వల్ల ఓపీ పెరగడం లేదని సమాచారం.

ఈహెచ్ఆర్‌తో పోలిస్తే ఓపీ దారుణం..

ఈహెచ్ఆర్ పేరుతో(ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు) రోజు వారీ వచ్చే ఓపీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ రికార్డుతో పోలిస్తే ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది చేతితో రాసి నిర్వహిస్తున్న ఓపీ రిజిస్టర్‌లోని సంఖ్య చాలా తేడా ఉంటుంది. సాధారణ ఓపీ రిజిస్టర్ లో క్షేత్రస్థాయి ఏఎన్ఎంలతో కొన్ని పేర్లు నమోదు చేయించి ఎక్కువ మంది వచ్చినట్లు చూపించే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తుంది.

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు అదనపు రుసుం చెల్లించొద్దు

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ తీసుకునే సమయంలో డెలివరీ బాయ్స్‌కు ఎటువంటి అదనపు రుసుం చెల్లించవద్దని ఎల్పీజీ వినియోగదారులకు జిల్లా పౌరసరఫరాల అధికారి పీ కోమలి పద్మ ఒక ప్రకటనలో సూచించారు. 15 కిలోమీటర్ల పరిధిలో నివసించే వినియోగదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలన్నారు. బిల్లు మాత్రమే చెల్లించాలని అన్నారు. డెలివరీ సమయంలో సిలిండర్ బరువు, లీకేజీలను చూసుకోవాలని అన్నారు. అదనపు రుసుం కోసం ఒత్తిడి చేస్తున్న డెలివరీ బాయ్స్‌పై టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మహిళ అనుమానాస్పద మృతి

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ 7/7కు చెందిన చల్లా కొండమ్మ(47) డాబాపై నుంచి కాలు జారిపడి మృతి చెందారు. కొండమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనికి సంబంధించి మందులు కూడా వాడుతున్నారు. మందులు వాడుతుండటంతో మత్తుగా ఉంటుంది. అయితే శుక్రవారం డాబా మీదకు వెళ్లి దుస్తులు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయారు. వెంటనే ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి భర్త పెద వెంగయ్య ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షోరూం నుంచి కొత్త కారు ఎత్తుకెళ్లిన విశ్రాంత సీఐ తనయుడు

పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటో నగర్‌లో కార్ల షోరూం నుంచి ఒక కొత్త కారును విశ్రాంతి సీఐ తనయుడు ఎత్తు కెళ్ళడం కలకలం రేపింది. పెదకాకాని సీఐ నారాయణస్వామి కథనం మేరకు వివరాలు.. గోరంట్లకు చెందిన విశ్రాంత సీఐఎస్ఎఫ్ సీఐ తనయుడు దిలీప్ చంద్రస్వామికి వివాహమైంది. వారికి ఒక సంతానం ఉన్నారు. భార్యాభర్తలు ఇరువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు గా పనిచేసేవారు. వారి మధ్య మనస్పర్ధల కారణంగా గొడవలు పడుతుండటంతో వారివురు తమ ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. దిలీప్ కుమారుడి ఆరోగ్యం కూడా సరిగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో దిలీప్ మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నెల 15న వేకువజామున సుమారు మూడు గంటల సమయంలో ఆటో నగర్‌లోని ఓ కార్ల షోరూమ్‌కి వెళ్లి కొత్త టాటా సఫారీ కారు తాను కొనుగోలు చేశానని, పండుగకు డెలివరీ తీసుకోవాల్సి ఉందని, ఇందుకుగాను తాళం ఇస్తే ట్రయల్‌కు వెళ్ళొస్తానని వాచ్‌మెన్‌కు చెప్పాడు. ఇదంతా నిజమేనని నమ్మిన వాచ్‌మెన్ కారు తాళాలు ఇచ్చాడు. దీంతో దిలీప్ టాటా సఫారీ కారు తీసుకుని వెళ్ళిపోయాడు. ఎంతకూ తిరిగిరాక పోవడంతో షోరూం నిర్వాహకులు పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి జాడ కోసం గాలిస్తుండగా 16వ తేదీన షోరూమ్‌కు సమీపంలోని షాపులో అపహరించిన కారుకు యాక్సరీస్ వేయిస్తుండటంతో పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు నిందితుడు దిలీప్‌ను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడం వల్ల ఇలా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

'పవన్ కల్యాణ్ పోరాటంతో విశాఖ ఉక్కుకు ఊపిరి'


మోహన్‌గాంధీని సత్కరిస్తున్న జనసైనికులు

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోరాటంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోస్తూ కేంద్ర ప్రభుత్వం రూ.11,400 కోట్లు కేటాయించడం హర్షణీయమని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. స్థానిక నాయుడుపేటలోని విశాఖ ఉక్కు ఉద్యమ సారథిగా పేరుగాంచిన దివంగత ఎమ్మెల్యే అమృతరావు విగ్రహానికి శుక్రవారం జనసైనికులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నాటి ఉద్యమంలో అశువులు కోల్పోయిన 32 మంది అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా అమృతరావు మనువడు మోహన్ గాంధీని జనసైనికులు శాలువాతో సత్కరించారు.

'కౌన్సిల్' కంచికి.. ప్రెస్‌మీట్ తర్వాత ఇంటికి!

- సంఖ్యా బలం ఉన్నా సమావేశం నిర్వహించని మేయర్
- చాంబర్‌లో వైసీపీ కార్పొరేటర్లతో భేటీ
- ఆ తర్వాత విలేకరుల సమావేశంతో సరి
- జీఎంసీ కమిషనర్, అధికారులపై అవినీతి ఆరోపణ


మీడియాతో మాట్లాడుతున్న మేయర్ మనోహర్ నాయుడు, పక్కన డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, వైసీపీ కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహిస్తామని నగర మేయర్ కేమనోహర్‌నాయుడు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మరీ ప్రకటించడం తెలిసిందే. మేయర్, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, వైసీపీ కార్పొరేటర్లు శుక్రవారం వచ్చారు. మేయర్ తన చాంబర్‌లో వైసీపీ కార్పొరేటర్లతో భేటీ అయి, కొంచెం సేపు వారితో చర్చించారు. మేయర్ తన చాంబర్ నుంచి బయటకు వచ్చి ప్రెస్ మీట్ పెట్టేసి వెళ్ళిపోయారే తప్ప, కౌన్సిల్ సమావేశం మాత్రం నిర్వహించలేదు. సంఖ్యా బలం ఉన్నప్పటికీ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. సమావేశం నిర్వహించేందుకు అధికారులు సహకరించడం లేదని మేయర్, డిప్యూటీ, వైసీపీ కార్పొరేటర్లు కుంటిసాకులు చెబుతున్నారు. వాస్తవానికి కౌన్సిల్ హాల్‌లో వేరే మీటింగ్ విషయమై నగరపాల సంస్థకు చెందిన అధికారు లంతా ఉన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులపై మేయర్ అవినీతి ఆరోపణలు చేశారు. వాస్తవానికి నగరపాలక సంస్థలో మొత్తం 57 మంది కార్పొరేటర్లు ఉండగా. అందులో ఒకరు 48 డివిజన్ చెందిన వైసీపీ కార్పొరేటర్ తనుబుద్ధి కృష్ణారెడ్డి మరణించారు. మిగిలిన 56 మంది కార్పొరేటర్లలో తెలుగుదేశం తరఫున 17 మంది, జనసేన తరఫున 6, వైసీపీ తరఫున 33 మంది కార్పొరేటర్లు ఉన్నారు.

విజయవాడలో వరదలు పేరిట అవినీతి: మేయర్ ఆరోపణలు

విజయవాడలో గత ఏడాది సంభవించిన వరదలు, బుడమేరు వాగు ముంపు బాధితులకు అందించిన సహాయక చర్యలలో 6 రోజుల్లో రూ.9.24 కోట్ల అవినీతి జరిగిందని మేయర్ కే మనోహర్ నాయుడు ఆరోపించారు. కార్పొరేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ నిధులను విజయవాడ వరదలు పేరిట అడ్డగోలుగా దోచుకున్నారని, కమిషనర్ పులి శ్రీనివాసులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడారని ఆరోపించారు. ఈఈ కోటేశ్వరరావు పేరుపై రూ.50 లక్షల నిధులు మళ్లించారని, అదేవిధంగా అనేకమంది ఏఈలు, డీఈలు, ఈఈల పేర్లపై నిధులు దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. ఈఈ కోటేశ్వరరావు ఇటీవల కొత్త కియో కారు కొనుగోలు చేశారని అన్నారు. నగరపాలక సంస్థ నిధులను కమిషనర్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు మింగేశారని ఆరోపించారు. కౌన్సిల్‌లో 80వ ప్రశ్నకు సమాధానం చెప్పలేకనే కమిషనర్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కమిషర్‌ను రెండు పర్యాయాలు తాను కోరినప్పటికీ ఆయన స్పందించ లేదని తెలిపారు. జీఎంసీలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు.

నిరూపిస్తే రాజీనామా చేస్తా: కమిషనర్

తనపై, ఇంజనీరింగ్ శాఖ అధికారులపై నగర మేయర్ మనోహర్ నాయుడు చేసిన ఆరోపణలను జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఖండించారు. తనపై అవినీతి, ఆరోపణలు నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానీ ఆయన స్పష్టం చేశారు. రూ 9 కోట్ల రూపాయల పనుల్లో ఏడు కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపణ చేస్తున్నారని, తాను ఎటువంటి అవినీతికి పాల్పడలేదని పేర్కొన్నారు. ఆ విధంగా అవినీతి పాల్పడి నిరూపిస్తే తెల్లపేపర్ పై సంతకం పెట్టి, ఉద్యోగానికి రాజీనామా చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఫిబ్రవరి 3 తర్వాత కౌన్సిల్ సమావేశం నిర్వహించే విషయాన్ని మేయర్ తో చర్చిస్తామని చెప్పామన్నారు. ఈ విషయమై సంబంధిత ఫైల్ కూడా మేయర్ కు సర్క్యులర్ చేశామని తెలిపారు.

వెల్‌నెస్ క్లినిక్‌లతో ప్రజారోగ్యానికి భద్రత


ప్రభుత్వ ఆసుపత్రిలో వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వెల్‌నెస్ క్లినిక్‌లు ప్రజల ఆరోగ్యానికి సంపూర్ణ భద్రత కల్పిస్తాయని, వాటి ద్వారా రోగాలు రాక ముందే అప్రమత్తం చేస్తారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలల్లో శుక్రవారం వెల్‌నెస్ క్లినిక్‌ను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకులపరుగుల జీవనంలో ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోతోందని, చిన్న వయసులోనే బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, రాష్ట్ర వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ముందు చూపుతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించాలనే దృక్పథంతో ప్రభుత్వ వైద్యశాలల్లో వెల్ నెస్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో పేరు గాంచిన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో వెల్ నెస్ క్లినిక్ ఏర్పాటు పేదలకు వరం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమ, బుధవారం మూడో నంబర్ ఓపీలో వెల్ నెస్ క్లినిక్ లు పని చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్ ఎస్ వి రమణ, కార్పొరేటర్ సమత, డాక్టర్ ఉమాశంకర్, ఫిరోజ్, పోతురాజు చంద్ర పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించాలి: ఎమ్మెల్యే మాధవి


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న విగ్రహావిష్కరణ కమిటీ ఛైర్మన్ నూకవరపు బాలాజీ

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్న నందమూరి తారక రామారావు వర్ధంతిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అంతటా ఘనంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించి, అధికారులతో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. శనివారం జరిగే ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకునేలా పార్టీ నేతలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో పాటు నగరంపాలెంలోని రిజిస్టర్ ఆఫీస్ వద్ద, నల్లచెరువు 3 బొమ్మల సెంటర్, కొరిటె పాడు మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలు జరగనున్నట్లు చెప్పారు. ఇన్నర్ రింగు రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం జరగ నుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మాధవి, నసీర్ లను విగ్రహావిష్కరణ కమిటీ ఛైర్మన్, కార్పొరేటర్ నూకవరపు బాలాజీ ఆహ్వానించారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న 'సుఖవాసి'


సుఖవాసి'కి శాశ్వత సభ్యత్వం అందిస్తున్న ఎమ్మెల్యే

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా శుక్రవారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. మాధవి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డు సృష్టిస్తోందని, కోటి సభ్యత్వాల మార్క్ దాటడంపై హర్షం వ్యక్తం చేశారు. నాయకులు శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని పిలుపు నిచ్చారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

- ఆర్టీవో సత్యనారాయణప్రసాద్


ఆర్టీవో సత్యనారాయణప్రసాద్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న డీపీటీవో రవికాంత్ తదితరులు

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నా యని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (ఆర్టీవో) బీ సత్యనారాయణప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీలో రోడ్డు ప్రమాద మాసోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆర్టీవో మాట్లాడుతూ డ్రైవర్లలో ఏకాగ్రత లోపించటం, మద్యం సేవించి నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం వలన అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపైకి వచ్చే వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్ మాట్లాడుతూ ప్రమాద రహిత ఆర్టీసీగా నిలిపేందుకు డ్రైవర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు-1, 2 డిపో మేనేజర్లు రామకృష్ణ, అబ్దుల్ సలాం, ఎన్టీఆర్ బస్టాండ్ ఏటీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయం పక్షాన నిలవాలి : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి


వైసీపీ లీగల్‌సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు మాధవిని సత్కరించి అభినందిస్తున్న అప్పిరెడ్డి

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై జరుగుతున్న న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు వైసీపీ లీగల్‌సెల్ న్యాయ వాదులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు.. వైసీపీ లీగల్ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రోళ్ళ మాధవి శుక్రవారం అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులోని ఆయన నివాసంలో న్యాయవాదులతో కలిసి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకట రెడ్డి, సోమసాని ఝాన్సీలక్ష్మి, కళ్ళం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి


టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు(తూర్పు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడో శనివారం స్వచ్ఛ దివస్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల అధికారులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్'లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే స్వచ్ఛ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెలా ఒక థీమ్‌తో 12 నెలలు స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించేలా మార్గదర్శకాలను జారీ చేశా రన్నారు. 'న్యూ ఇయర్- క్లీన్ స్టార్' థీమ్‌తో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు జిల్లాలో నిర్వహణకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు.

నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్ల సలహాలు దోహదం

- జీఎంసీ కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగ రాభివృద్ధికి సీనియర్ సిటిజన్ల సూచనలు, సలహాలు ఎంతో దోహద పడతాయని జీఎంసీ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం సీనియర్ సిటిజన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, అటువంటి వారి సూచనలు సలహాలు నగరాభివృద్ధికి ఎంతగానో అవసరమన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పార్కులు, డివైడర్ల నిర్వహణ వంటి అంశాలపై నిర్మాణాత్మకమైన సూచనలు అందించాలని కోరారు. సీనియర్ సిటిజన్స్, జీఎంసీ అధికారులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, గ్రూప్‌లో వారి అభిప్రాయాలను పోస్ట్ చేయవచ్చునని తెలిపారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లు మాట్లాడుతూ, తొలిసారిగా నగరాభివృద్ధి, నగరంలో చేపట్టాల్సిన అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపేందుకు సమావేశం ద్వారా వేదిక కల్పించినందుకు నగర కమిషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నగరంలో ప్రధానంగా వార్డు అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలని, నార్ల ఆడిటోరియం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మొదలైన సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సి.హెచ్ శ్రీనివాసరావు, యస్.ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, పి.ఓ రామారావు, ఎ.డి.హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా ర్యాలీ

ప్రతి నెలా 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే కార్యక్రమాల్లో నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు.స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం నోడల్ అధికారులతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. సదరు కార్యక్రమాలకు ప్రోటోకాల్ మేరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శనివారం జిల్లా కలెక్టరేట్ నుండి హిందూ కాలేజీ సిగ్నల్ జంక్షన్ వరకు సుమారు 2 వేల మందితో స్వచ్ఛతా ర్యాలీ, మానవహారం నిర్వహించడం, ప్రతిజ్ఞ చేయడం ఉంటుందని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ బీ రాజమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐపీడీ కాలనీ, ఆర్ అగ్రహారం, చాకలి గుంట, అమీన్‌నగర్, పీవీ నగర్, గాంధీనగర్, వై జంక్షన్, రమేష్ హాస్పటల్ రోడ్డు, ఎత్తురోడ్డు, ఏటుకూరు రోడ్డు, మూడు బొమ్మల సెంటర్, నగరంపాలెం, మస్తానయ్య దర్గా వెనుక రోడ్డు, కన్నావారితోట, నల్లచెరువు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.

మతోన్మాద శక్తులను ప్రతిఘటించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మతోన్మాదశక్తులు పాగా వేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని, అటువంటి శక్తులను ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్య మించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లా డుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ఇదిలా ఉండగా, అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 19న జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్షపార్టీలు పిలుపునిచ్చాయి. నిరసనల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరాయి.

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం


ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారంతో వాసిరెడ్డి విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళా పరిషత్ 20వ నాటకోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అంబటి మధుమోహన్ కృష్ణ అధ్యక్షత వహించారు. అతిథులుగా ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిడి తిలక్ బాబు, సాహితీవేత్త డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, తెనాలి ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొలసాని రామ్‌చంద్, సంస్థ కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు, బొప్పన నరసింహారావు, జి మల్లికార్జునరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీవీఐటీ విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్‌కు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం అందజేసిన నిర్వాహకులు, ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం తెలుగు కళా సమితి-విశాఖపట్నం, పీటీ మాధవన్ రచన, చలసాని కృష్ణ ప్రసాదు దర్శకత్వం వహించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత', అభినయ ఆర్ట్స్-గుంటూరు వారి స్నిగ్ధ రచనకు ఎన్. రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించిన ఇంద్రప్రస్థం నాటికలను ప్రదర్శించారు. ఈ రెండు నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.


'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటికలో ఓ సన్నివేశం

20న భజరంగ్ జూట్‌మిల్ ఎదుట నిరసన శిబిరం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం రోడ్డులోనున్న భజరంగ్ జూట్ మిల్ ఆస్తుల పరిరక్షణ కోరుతూ ఖాయిలా పరిశ్రమల బోర్డు స్పందన కోసం ఈ నెల 20 న జూట్ మిల్ ఎదుట నిరసన శిబిరం నిర్వ హించనున్నట్లు కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఖాయిలా పరిశ్రమల బోర్డు నుంచి నిర్వహణ నిమిత్తం మాత్రమే మేనేజ్‌మెంట్‌కు జూట్ మిల్ ఇచ్చారని, ఈ నేపథ్యంలో వివాదాస్పదంగా మారిన, ఉత్పత్తి నిలిపివేయబడిన ఈ జూట్ మిల్ విష యంలో కేంద్ర ప్రభుత్వ స్పందన తక్షణ అవసరమని ఆయన పేర్కొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల శివరామయ్య

కార్యకర్తలే టీడీపీ బలం: కంచర్ల శివరామయ్య

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య చెప్పారు. పార్టీ జిల్లా కార్యా లయ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోటిమందికి పైగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం, పార్టీపై కార్యకర్తలకు ఉన్న నమ్మకాన్ని రుజువు చేస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి ఇచ్చిన భరోసా, వైసీపీ దౌర్జ న్యాలు, అరాచకాలకు బలైపోయిన కార్యకర్తల కుటుంబాలను టీడీపీ ఆదుకోవడంతోనే ఇది సాధ్యపడిందని చెప్పారు. కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే రూ. 5 లక్షలు ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేస్తోంది దేశంలో టీడీపీయేనని తెలిపారు. వైసీపీ దాడుల్లో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో ఉచితంగా విద్య నందిస్తోంది కూడా టీడీపీయేనని అన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి రామారావు, షేక్ చిన్న బాజీ, కెఎంఈ హుస్సేన్, యర్రగుంట్ల ఆనంద్, బెల్లంకొండ సురేష్, వడ్డే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి


త్యాగరాజు కీర్తనలను ఆలపిస్తున్న కాంతి స్వరూప్

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో త్యాగ రాజస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రధాన కచేరీలో హైదరా బాద్‌కు చెందిన మల్లెల కాంతి స్వరూప్ శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి ప్రేక్ష కులను ఆకట్టుకుంది. 'గిరిరాజ సుధా 'అంటూ ప్రారంభించి అనేక త్యాగరాజ కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. వీరికి వాయులీనంపై పప్పు జ్ఞానదేవ్, మృదంగంపై పీ విజయభాస్కర్, ఘటంపై ఎస్ హను మంతరావు వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతర కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను సంఘ ఉపాధ్యక్షుడు ఎస్. గిరిజాశంకర్, కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ పర్యవేక్షించారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు అదనపు రుసుం చెల్లించొద్దు

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ తీసుకునే సమయంలో డెలివరీ బాయ్స్‌కు అదనపు రుసుం చెల్లించవద్దని ఎల్‌పీజీ వినియోగదారులకు జిల్లా పౌరసరఫరాల అధికారి పీ కోమలి పద్మ ఒక ప్రకటనలో సూచించారు. 15 కిలోమీటర్ల పరిధిలో నివసించే వినియోగ దారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలన్నారు. బిల్లు మాత్రమే చెల్లించాలని సూచించారు.

జోన్ డైరీ

● మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఎగువ, దిగువ సన్నిధులతో పాటు ఉపాలయమైన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను శనివారం ఉదయం లెక్కించనున్నట్టు దేవాదాయ శాఖ సహాయ కమిషనరు, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు, భక్త బృందం ప్రతినిధులు హుండీల లెక్కింపులో పాల్గొనాలని ఆయన కోరారు.

● స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం మంగళగిరి పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్టు ఎంటీఎంసీ అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గాలిగోపురం వద్ద నుంచి పారిశుధ్య పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

● మండలకేంద్రం దుగ్గిరాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకూ ర్యాలీ, అనంతరం మానవహారం ఏర్పాటు, ప్రతిజ్ఞ కార్యక్ర మం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

● పెదనందిపాడు, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం నిర్వహించనున్న ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు శుక్రవారం పూర్తయ్యాయి. ఎన్టీఆర్ విగ్రహాలను రంగులు, తోరణాలతో తీర్చిదిద్దారు. పలు ప్రాంతాల్లో నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

రైతులకు త్వరలో 'అన్నదాత సుఖీభవ'

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
● పూడిక తీసిన సాగునీటి కాలువల పరిశీలన
● గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


మల్లాయపాలెం మేజర్ వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంకింద త్వరలోనే రైతులకు ప్రభుత్వం రూ. 20 వేలు అందజేయనుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని వంకాయలపాడు మేజర్, మల్లాయపాలెం మేజర్ కాలువల్లో పూర్తయిన పూడిక తీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కాలువ పొడవునా పూడిక తీయడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు నీరు నేరుగా పొలాలకు చేరుతుంది. ఈ క్రమంలో ఆయా కాలువల వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార సమయంలోనే రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీల్లో భాగంగానే ఇటీవల సాగు నీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేసి, కాలువల ఆధునికీకరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పుడు పనులు పూర్తయిన కాలువలలో ఎక్కడా నాచు, జమ్ము, తూటాకు లేకపోవడంతో చివరి వరకు సాగునీరు స్వేచ్ఛగా ప్రవహిస్తోందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో కాలువల గురించి పట్టించు కున్న దాఖలాలే లేవన్నారు. వంకాయవలపాటి మేజర్ ద్వారా 20600 ఎకరాల ఆయకట్టు చివరి వరకు నీరు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో రైతులు పంపుల ద్వారా వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పొలాలకు నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. పూర్తి నిరుపయోగంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలను రైతులకు ఉపయోగపడే విధంగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీసీ కమిటీ ఛైర్మన్లు అయినంపూడి నాగేశ్వరరావు, కల్లూరి కుసుమ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్, కాకుమాను మండల పార్టీ అధ్యక్షులు నువ్వుల సునిల్ చౌదరి, కుర్రి సుబ్బారెడ్డి, కల్లూరి శ్రీనివాసరావు, కాకాని సురేష్, చిన్నం శ్రీకాంత్, మల్లం రామకృష్ణ, కోటపాటి సదాశివరావు, ఆలపాటి పాండురంగారావు, వెలివెల్లి సుబ్బారావు, బొందలపాటి శేశిరెడ్డి, శిఖా నవీన్, నాదేండ్ల వెంకయ్య, మురకొండ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్

తాడేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక నందమూరి తారక రామారావు అని, రాష్ట్ర ప్రజల కోసం ఎన్టీఆర్ చేసిన కృషిని ఎవరూ మర్చిపోలేరని, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో నూతన ఒరవడి సృష్టించిన ఘనత కూడా ఎన్టీఆర్‌కే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. శనివారం జరగనున్న ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని తాడేపల్లిలో రమేష్ విలేకులతో మాట్లాడారు. ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాత రాష్ట్ర ప్రజల్లో రాజకీయ చైతన్యం బాగా పెరిగిందన్నారు. ఎన్టీఆర్ అనంతరం చంద్రబాబునాయుడు నాయకత్వంలో పార్టీ నూతన ఒరవడిలో ముందుకు పయనిస్తోందన్నారు.


విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో రిటర్నబుల్ ప్లాట్ల ప్రొవిజన్ పత్రాలు రైతులకు అందిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

● ఈ-లాటరీ ద్వారా 39 మంది రైతులకు 72 ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, జనవరి 17:(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ స్కీం కింద భూములు ఇచ్చిన రైతులకు ఏపీ సీఆర్డీఏ కమీషనర్ ఆదేశాల మేరకు విజయవాడ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఈ - లాటరి కార్యక్రమం నిర్వహించి ప్లాట్లను కేటాయించారు. ముందుగా ట్రైల్ రన్ వేసి ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా వాణిజ్య, నివాస ప్లాట్లను కేటాయించారు. అబ్బరాజుపాలెం, రాయపూడి 12, కొండమరాజుపాలెం, వెలగపూడి, మందడం 12 గ్రామాలకు సంబంధించిన 39 మంది రైతులకు, 72 ప్లాట్లు అందజేశారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సౌకర్యవంతంగా జరిగేందుకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు చేసిందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.ఎస్. భాగ్యరేఖ, కె.స్వర్ణమేరి, ప్లానింగ్ విభాగడైరెక్టర్ బి.సురేష్ కుమార్, తహసీల్దార్ అరుణా దేవీ, అతర అధికారులు పాల్గొన్నారు.


తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రైతుల సమస్యలు వింటున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్. ప్రవీణ్ చంద్

రైతుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

● సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

తుళ్లూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో రాజధాని రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులను సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు, రైతుకూలీలు నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ డేను రాజధాని ప్రాంత రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అమరావతిలో భూమి వ్యవహారాలు -37. ప్రణాళిక విభాగం -1. మొత్తం 38 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కే.స్వర్ణమేరి, పి.పద్మావతి, జి.రవీందర్, ఏజీ చిన్నికృష్ణ, బీ.సాయి శ్రీనివాస్‌నాయక్, సామాజిక అభివృద్ధి విభాగ డీసీడీవో బీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకాల్వకు 1818 క్యూసెక్కులు

దుగ్గిరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 140 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 184, పశ్చిమకాల్వకు 68 , నిజాంపట్నంకాల్వకు 83, కొమ్మమూరు కాల్వకు 640 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నిత్యావసరాల పంపిణీ

దుగ్గిరాల, జనవరి 17: దుగ్గిరాల జాగృత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది పేదలకు శుక్రవారం నిత్యావసర సరుకులను అందజేశారు. స్వామి విమలానంద ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో బియ్యం, కందిపప్పు, గోధుమపిండి, నూనె, తదతర వస్తువులను ఆశ్రమ నిర్వాహకురాలు జంపాల కుసుమకుమారి, జాగృతభారత్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి గణేష్, ఆలా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్‌అధికారుల తనిఖీలు

● రూ.8.44లక్షల అపరాధ రుసుం విధింపు


తనిఖీలకు విచ్చేసిన విద్యుత్ శాఖ అధికారులు

తాడేపల్లి, జనవరి17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు సీఆర్‌డిఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ వీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తాడేపల్లి పరిధిలోని కృష్ణనగర్ సెక్షన్‌లో శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 37 మంది అధికారులు 111 మంది సిబ్బంది 37 బృందాలుగా ఏర్పడి 3105 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతించిన క్యాటగిరి కాక ఇతర క్యాటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇరువురికి రూ.0.33 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్‌ను వాడుతున్న 177 మందికి రూ.8.11 లక్షలు మొత్తం రూ.8.44 లక్షల అపరాధరుసం విధించారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ సర్కిల్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, బకాయిలు సకాలంలో వసూలుచేయాలని విద్యుత్ చౌర్యం పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జే సంజీవరావు, డీఈఈలు ఎన్ మల్లికార్జున ప్రసాద్, కే. రవి కుమార్, జి సురేష్‌బాబు, ఏఈలు ఎం సతీష్‌కుమార్, యు శివశంకర్, కే కోటేశ్వరరావు, ఆపరేషన్ ఏఈ వీ శివషణ్ముఖరావు, ఆపరేషన్ డీఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ జీ సురేష్‌బాబు తెలిపారు. జీటీ రోడ్డు తూర్పు వైపు నులకపేట 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నుంచి శర్మడాబా వరకు, ప్రకాష్‌నగర్ అంబేద్కర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

స్వచ్ఛ దివస్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడో శనివారం స్వచ్ఛ దివస్‌ను ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల అధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే స్వచ్ఛ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెలా ఒక థీమ్‌తో 12 నెలలు స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించేలా మార్గదర్శకాలను జారీ చేశారన్నారు. 'న్యూ ఇయర్- క్లీన్ స్టార్ట్ థీమ్‌'తో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు జిల్లాలో నిర్వహణకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు.

మతోన్మాద శక్తులను ప్రతిఘటించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బాబురావు పిలుపు

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో మతోన్మాద శక్తులు పాగా వేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని, అటువంటి శక్తులను ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. బాబురావు మాట్లాడుతూ జమిలి ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతి రేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్య మించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసముంటున్న పేద లకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ఇదిలా ఉండగా, అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 19న జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. నిరసనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరాయి.

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి

దుగ్గిరాల, జనవరి 17: మండలకేంద్రం దుగ్గిరాలలోని రైలుపేట ఎన్టీఆర్ పుర వేదిక వద్ద నిర్వహించనున్న ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత పిలుపు నిచ్చారు. ఉదయం 11గంటలకు కార్యక్రమానికి ప్రారంభమౌతోందని, ముందుగా 9 గంటలకు జంపాల కాంప్లెక్స్ (అంజనాసూపర్‌మార్కెట్) ఎదుట వున్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు

● లీడ్‌బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి వెల్లడి


అవగాహన సదస్సులో కౌలు రైతులతో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి

దుగ్గిరాల, జనవరి 17: రుణార్హత కార్డుకలిగిన కౌలు రైతులందరికీ రూ.1లక్ష వరకూ వడ్డీలేని రుణాలను అందిస్తామని లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలగ్రామం ఈమనిలోని యూనియన్ బ్యాంక్, వ్యవసాయశాఖ సంయుక్తంగా కౌలు రైతులకు బ్యాంకురుణాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి పీ శిరీష అధ్యక్షతన జరిగిన సదస్సులో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, సక్రమంగా రుణాల చెల్లింపులు జరిపే కౌలురైతులకు 25పై వడ్డీతో రూ.3 లక్షల వరకూ రుణాలిస్తుందన్నారు. ఇప్పటి వరకూ రుణాలు తీసుకోని కౌలురైతులకు భూసర్వేనెంబర్ల ఆధారంగా రుణావకాశం కలుగుతుందన్నారు. యూనియన్ బ్యాంక్ ఈమని బ్రాంచ్ మేనేజర్ ఏసుబాబు మాట్లాడుతూ, గ్రామంలో 52రైతుమిత్ర గ్రూపులు న్నాయని, వారి రుణాలు 10 నుంచి 15 శాతం వరకూ చెల్లిస్తే ఒకేవిడతలో బకాయిలు చెల్లిస్తే కొత్తరుణాలకు అర్హత లభిస్తుందన్నారు. కౌలురైతు సంఘ కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, కౌలురైతులందరికీ రుణాలిప్పించాలని కోరారు. భూయజమాని రుణం తీసుకొనట్లైతేనే సాగుచేసే కౌలురైతులకు రుణావకాశం కల్పుతుందన్నారు. ఏడీఏ ఉషారాణి, మండల జనసేన అధ్యక్షుడు పీ.శ్రీనివాసరావు, వీఆర్‌ఏ రమేష్, వీఏఏ రఫీ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.


లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న తనిఖీ బృందం

దివ్యాంగ ఫించన్ల తనిఖీ

పెదనందిపాడు, జనవరి, 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ ఫించన్లపై శుక్రవారం ప్రత్యేక బృందంలోని సభ్యులు తనిఖీలు చేపట్టారు. మంచానికి పరిమితమై, శాశ్వత వైకల్యం వున్నట్లు జాబితాల్లో పేర్లు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. మండల పరిధిలోని 17 గ్రామాల్లో 40 మంది పక్షవాతం, ఇతర సంబంధిత వ్యాధులుకలిగి దివ్యాంగ ఫించను రూ.15 వేలు తీసుకుంటున్న వారికి వైద్యులు బీఎస్ రవితేజ, ఎన్ సింధూరలు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు సేకరించారు. లబ్ధిదారులు పొందిన వైకల్య ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. బృందంలోని అధికారుల వెంట వైద్యాధికారి జి లావణ్య, సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాద్‌స్వామి, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

45వ రోజుకు ఏసీసీ కార్మికుల దీక్షలు


దీక్షల్లో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నేతలు

తాడేపల్లి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసిసి సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారంతో 45వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయబద్దంగా తమకు రావలసిన నష్ట పరిహారం కోసం పోరాటం చేస్తున్న ఏసీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని కోరారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబించడం వలనే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కేఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో భాగంగా ఏసీసీ కార్మికులకు ఇచ్చిన మాటను నారా లోకేశ్ నెరవేర్చలేదన్నారు. దీక్షల్లో తుపాకుల దుర్గా భవాని, ఈదులమూడి శారమ్మ, బళ్లా శివకుమారి, మాలిన్, కరీం, నిషా, తదితరులు కూర్చున్నారు. కార్యక్రమానికి మద్దతుగా యూనియన్ నేత కూర పాటి స్టీవెన్, సూర్య ప్రకాష్, అంకయ్య, గురవయ్య, ఎం ఆశీర్వాదం, దానయ్య, శివ, నరసింహారావు, శాస్త్రి, సాంబయ్య పాల్గొన్నారు.

పలువురి నేతల సంఘీభావం

హరిజన కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా మార్క్

తుళ్లూరు జనవరి 17:(ఆంధ్రజ్యోతి) రాయపూడి హరిజన కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా దార్ల మార్క్ ఎన్నికయ్యారు. శుక్రవారం రాయపూడి ఎల్ఈ పాఠశాలలో సొసైటీ కమిటి ఎంపికకు ఎన్నికలు జరిగాయి. సెక్రటరిగా వలపర్ల సురేష్, సభ్యులుగా గద్దె అశోక్, సరిగల సునిల్, ఇసుకపల్లి ప్రేమ్ కుమార్ ఎన్నికయ్యారు. అభ్యర్థులకు 191 మంది చేతులు పైకి ఎత్తి ఓటు వేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సభ్యుల గెలుపును అధికారికంగా ధ్రువీకరించారు.


నియామక పత్రాలతో రాయపూడి హరిజన కోఆపరేటివ్ కమిటి సభ్యులు

నేడు పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

పొన్నూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు పొన్నూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు నిర్వహించే ఈ ర్యాలీ ద్వారా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కొలవరం రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేత

తెనాలి క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెనాలి-విజయవాడ మార్గంలోని కొలవరం రైల్వే గేటును శనివారం తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో ట్రాక్ మరమ్మతుల కోసం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గేటు మూసి వేయడం జరుగుతుందని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని రైల్వే అధికారులు తెలిపారు.

జూదరుల అరెస్టు

కొల్లిపర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం జూదరులపై దాడులు నిర్వహించగా అత్తోటలో ఎనిదిమంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం అత్తోటలో ఎనిమిది మంది జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న రూ.8,200లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.



షాపు యజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు

ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ పరిధిలోని వ్యాపారులు తమ వ్యాపార సంస్థల మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని అన్నారు. శనివారం పట్టణంలో నాలుగో డివిజన్‌లోని వ్యాపార సంస్థలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంలో కొన్ని షాపులకు ట్రేడ్ లైసెన్స్‌లు కూడా లేకపోవడం మరికొన్ని షాపులకు ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ చేయకపోవడం గమనించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సచివాల సిబ్బంది సర్వే నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్, కొత్త లైసెన్స్‌లను మంజూరు చేయాలని ఆదేశించారు. లైసెన్సులు లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ము న్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రేపు గ్రామోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహిస్తామని సీతారామశర్మ పట్టాభి తెలిపారు. ఈ నెల 19న మార్కెట్ సెంటర్‌లోని రామాలయం నుంచి బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. అంగలకుదురు వాసుదాస స్వామి పీఠంలో 20వ తేదీన గ్రామోత్సవం, 22న సీతారాముల కల్యాణం, అన్నదానం జరుగుతాయన్నారు.

హోటల్ నిర్వాహకుడి మోసంపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హోటల్‌కు ఇచ్చిన అడ్వాన్స్‌ను తిరిగి చెల్లించకుండా మోసం చేశాడంటూ బాధితుడు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెంచుపేటలోని ఓ హోటల్ నిర్వాహకుడు సందీప్ చౌదరి వంట మాస్టర్‌గా పనిచేసే పసుపులేటి షణ్ముఖరావు వద్ద రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకొని హోటల్ నిర్వహించుకోమని అద్దెకు ఇచ్చాడు. వ్యాపారం సరిగా సాగక హోటల్ నిర్వహణను విరమించుకుంటున్నానని పలుమార్లు అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని కోరాడు. డబ్బులు ఇవ్వకపోవటంతో బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి నగదు సాయం

తెనాలి అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో ప్రతిభ చూపిన పేద విద్యార్థి రావూరి జయేంద్రకు రూ.10వేలు నగదు సాయం అందించారు. వంగవీటి రాధారంగా స్మారక యువజన సేవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కవి సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు జయంతి నిర్వహించారు. కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ సీఈవో బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, సమితి ఆధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఏ పూర్తిచేసి ఇంటర్న్‌షిప్ సాధించిన కవల సోదరులు జక్కా ఆకాష్, ఆదిత్యలను సన్మానించారు. టి.మురళి, టి.శివశంకర్, పి.విజయ్‌కుమార్, కె.హరీష్, రజిని, సాంబశివరావు, శంకర్, ప్రేమ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

న్యాయవాదుల దీక్షకు వైసీపీ మద్దతు

పొన్నూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం వైసీపీ నాయకులు మద్దతు తెలిపారు. స్థానిక ఐలాండ్ సెంటర్లోని దీక్షల శిబిరానికి వైసీపీ ఇన్చార్జి అంబటి మురళీకృష్ణ, వైసీపీ నాయకులు వచ్చి నాయవాదుల దీక్షకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ న్యాయవాది బేతాళ ప్రకాష్‌పై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రకాష్‌పై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, ఎంపీపీ భవనం పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాల్వ కట్టలు

● సాగునీటి సంఘాలపైనే రైతున్నల ఆశలు
● కాల్వల్లో తూటికాడ, గుర్రపుడెక్క
● చివరి భూములకు నీరందించాలని పలువురి వినతి





కోతలకు గురైన రేపల్లె కాల్వ కట్ట

తెనాలి క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో కాల్వ కట్టలు, కట్టలు అధ్వానంగా తయారయ్యాయి. గత పాలకుల పాలన అనుభవ రాహిత్యం, ఏకపక్ష నిర్ణయాలు రైతుకు సమస్యలను మిగిల్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటుచేసిన సాగునీటి సంఘాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణా పశ్చిమ డెల్టాలోని కొమ్మూరు కాల్వ, నిజాంపట్నం కాల్వ, తూర్పు, పశ్చిమ కెనాల్, కేడబ్ల్యూ కెనాల్‌ల పరిధిలో 350 కి.మీ. మేర కాల్వలు విస్తరించి 5.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయి. గత ప్రభుత్వం వీటి పరిధిలోని పంట కాల్వల్లో షట్టర్ల మరమ్మతులు, కాల్వల్లో ఏర్పడిన తూటికాడ, గుర్రపుడెక్క లాంటి అడ్డంకులు తొలగింపునకు చర్యలు చేపట్టలేదు. దీంతో కొద్దిపాటి వర్షానికే పంటలు మునిగి రైతులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కాల్వపై పర్యవేక్షణకు 230మంది లస్కర్లు అవసరం ఉంది. ప్రస్తుతం 40 మందితోనే కాల్వలపై పర్యవేక్షణ కొనసాగుతోంది. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో గ్రామాల్లో కాల్వ కట్టల ఆక్రమణలు పెరిగాయి. రెండు, మూడు ట్రాక్టర్లు వెళ్లే విశాలమైన కట్టలు కూడా తవ్వకాలతో, ఆక్రమణలకు గురై నేడు ఆ బాటలో ఒక ట్రాక్టర్లు వెళ్లాలంటేనే కష్టంగా మారింది. కొన్ని చోట్ల డొంకలు కూడా కాలిబాటలుగా మారాయి. గతంలో కాల్వ కట్టల పటిష్టతకు, షట్టర్ల మరమ్మతులకు, కాల్వ పూడికతీతలో ప్రభుత్వం ఎకరానికి రూ.200 వంతున నీటితీరువా వసూలు చేసేది. డెల్టాలో నీటి తీరువా కింద ఏడాదికి రూ.114 కోట్ల వసూలు అయ్యేవి. వీటితో పాటు కేంద్ర, రాష్ట్రాలు అందించే నిధులు కలుపుకుని కాల్వ కట్టలు, షట్టర్లు, తూములు, లాకులు వంటివి మరమ్మతులకు నోచుకునేవి. గత ప్రభుత్వం నీటి తీరువా వసూలు చేయకపోగా, కాల్వల మరమ్మతులకు తూటికాడ తొలగింపునకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో గత ఐదేళ్లలో కాల్వల వ్యవస్థ పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. ఈ ఐదు సంవత్సరాలలో రైతుల నుంచి రావాల్సిన నీటి తీరువాతో కాల్వకట్టలు ఆక్రమణలు, తవ్వకాలను నిరోధించవచ్చు. దీనిని గత ప్రభుత్వం అమలు జరపలేదు. తెనాలి, పొన్నూరు, గుంటూరు, బాపట్ల వంటి పట్టణాల్లో వచ్చే మురుగు, వ్యర్థాలను పంట నీటి కాల్వలల్లోకి విడుదల చేస్తున్నారు. ఈ కాల్వల్లోని నీటిని రైతులు ఉపయోగించడం వలన భూములు చౌడుబారిపోతున్నాయి. కాల్వకట్టలు బలహీనపడటంతో పాటు కొందరు రైతులు ఇష్టం వచ్చినట్లు కట్టలు తవ్వి తూములు వేసుకోవడం, కాల్వకు అడ్డంకులు వేయడం వలన దిగువ భూముల రైతులకు సాగునీరు అందక భూములు బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేపల్లె, పొన్నూరు, బాపట్ల, చీరాల, గుంటూరులోని సమ్మర్ స్టోర్ చెరువులకు ఈ కాల్వల ద్వారానే సాగునీరు అందించాలి. కాల్వలు దుస్థితి అధ్వానంగా ఉండటంతో గతంలో వాటికి కూడా నీరు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు సకాలంలో కాల్వలకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనికి గాను మేజరు, మైనర్, సబ్ మైనర్ కాల్వలను పటిష్టపరచాలి. చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన నూతన సాగునీటి సంఘాలు ఈ బాధ్యతలను ఉన్నతంగా నెరవేరుస్తారన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.



మోదుకూరు వద్ద కాలిబాటగా మారిన కాల్వ కట్ట

మున్సిపల్ ఉద్యోగికి ఘన నివాళి



షరీఫ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ కార్యాలయంలో ఆరోగ్య విభాగ డిప్యూటీ స్టాటిస్టిక్ ఆఫీసర్ (డీఎస్‌వో)గా పని చేస్తున్న సయ్యద్ షరీఫ్ ఈ నెల 15వ తేదీన మృతి చెందాడు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నతో కలసి డీఎస్‌వో షరీఫ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, మున్సిపల్ మేనేజర్ చండి దేవసేన, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

కాండం తొలుచు పురుగును నివారించాలి: ఏవో

పొన్నూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జొన్న, మొక్కజొన్న పైర్లలో కాండం తొలుచుపురుగు ఉధృతి అధికంగా ఉందని సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో డేగల వెంకట్రామయ్య సూచించారు. మండల పరిధిలోని దండమూడి, మునిపల్లె గ్రామాలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో జొన్న, మొక్కజొన్న అపరాల పంటలను అధికారులు పరిశీలించారు. మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు సూచించారు. మినుము, పెసర పంటల్లో పోషకాల వినియోగంపై అవగాహన కల్పించారు. రబీలో సాగుచేస్తున్న రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి: సునీత

తెనాలి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ రసాయనాలతో సాగు చేసే విధానాన్ని విడనాడి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని జిల్లా వనరుల కేంద్రం డీఆర్‌సీ ఎస్ఎమ్‌టీ సునీత చెప్పారు. శుక్రవారం మండలంలోని ఎరుకలపూడిలో ప్రకృతి వ్యవసాయంలో మొక్కజొన్న సాగుచేస్తున్న రైతు విజయలక్ష్మి పంట పొలాన్ని, ఇతర పొలాలను అధికారులు, వీఏఏలతో కలిసి ఆమె క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మొక్కజొన్నలో వచ్చే చీడపీడలను ప్రకృతి సాగుపద్ధతిలో నివారించే విధానాలపై వీఏఏలకు అవగాహన కల్పించారు. అనంతరం రసాయనిక పద్ధతుల్లో సాగుచేస్తున్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏపీఎస్ఎస్ అనే యాప్ ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. గుంటూరు ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి రాజకుమారి, ఎస్ఎంటీలు శివకుమారి, రాజవంశీ, తెనాలి ఏడీఏ ఉషారాణి, మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్ వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుదారులు బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చు: ఏవో

తెనాలి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేస్తూ కౌలు రైతు కార్డులున్న అన్నదాతలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ చెప్పారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏవో మండలంలోని తేలప్రోలు, నేలపాడు గ్రామాల్లో పర్యటించి సాగులో ఉన్న మొక్కజొన్న పైర్లను రైతులతో కలసి పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు చేపట్టవల్సిన సస్యరక్షణ చర్యలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏవో ప్రేమసాగర్ మాట్లాడుతూ ఈ నెల 29న కౌలు రైతు కార్డులున్న రైతులకు లోన్లు ఇచ్చేందుకు కొలకలూరులో బ్యాంక్ ద్వారా మెగా క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌలు కార్డులు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ అహ్మద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి: ఎంవీఐ

తెనాలి క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎంవీఐ టి.రాఘవరావు అన్నారు. జాతీయ రోడ్డు వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మార్కెట్ యార్డులో వివిధ వాహనదారులకు ఎంవీఐ టి.రాఘవరావు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు అనుకోని సంఘటన జరిగి ప్రాణాలు కోల్పోతే కన్న తల్లిదండ్రులు, భార్య, బిడ్డలు ఎదుర్కొనే దీన పరిస్థితి గుర్తెరగాలన్నారు. ఎమర్జెన్సీ వాహనాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలకు తప్పనిసరిగా దారి ఇవ్వాలని, ఆటోడ్రైవర్ల యూనిఫాం, డ్రైవింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించండి

● మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



ఫ్రైడే డ్రైడే ర్యాలీని నిర్వహిస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, బాలచంద్రమౌళి తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తమ ఇంటి పరిసరాలలో పరిశుభ్రతలను పాటించి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. స్థానిక 10వ వార్డు జంధ్యాల వారి వీధిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని మలేరియా అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పాల్గొని ప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలతోపాటు వార్డు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అందరూ దోమతెరలను కూడా వాడాలని సూచించారు. అనంతరం ఫైడేడ్రేడే అవగాహన ర్యాలీను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం అక్కమ్మ, వాత్సల్య, శంషాద్ బేగం, ఆశాకార్యకర్తలు సంధ్య, అలేఖ్య, లక్ష్మి, నరగదీపిక దుర్గ, శానిటరీ సెక్రటరీ లక్ష్మి, శివజ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చంద్రశేఖరస్వామి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో స్వామివారు

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో ఐదు రోజులుగా జరుగుతున్న చంద్రశేఖర స్వామి ఆర్ధ్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై చంద్రశేఖర స్వామి వారిని, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటుచేసి ఆలయం సమీపంలోని చెరువులో తెప్పోత్సవాన్ని జరిపించారు. ఈ తెప్పోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర ప్రసాద్ పర్యవేక్షించారు.

దశావతార వేంకటేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో మహాగణపతిస్వామి వారికి సంకటహర చతుర్థి సందర్భంగా ఘనంగా సంకటహర చతుర్థి వ్రతాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● మండల వైద్యాధికారి ప్రియాంక

కొల్లిపర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ బీపీ, షుగర్‌లకు ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ రమ్య, హెల్త్ అసిస్టెంట్ సుదర్శన్, డీఈవో బి.కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందిస్తున్న సుందరయ్య, నిర్వాహకులు

చిన్నారులకు ఆటల పోటీలు

తెనాలి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాఫ్‌పేటలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో బాలమేళా కార్యక్రమం ద్వారా పలు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బాలబాలికలకు ఎంపీటీసీ ఇసుకపల్లి సుందర్‌రావు బహుమతులు అందజేశారు. క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి.వెంకట్ పర్యవేక్షణలో జరిగినం కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి ఇందూ, సచివాలయ సిబ్బంది చంద్రిక, ఉమ, అంగన్‌వాడీ వర్కర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● వైద్యాధికారి డాక్టర్ మహిత

ఫటా ఫట్



తెనాలి, మారీసుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్వాసకోశ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సుల్తానాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత చెప్పారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో శ్వాసకోశ వ్యాధులపై ఆమె తెలిపిన వివరాలు.

ప్రశ్న: శ్వాసకోశ వ్యాధి అంటే ఏమిటి?

జవాబు: ఉపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవ్వడాన్ని శ్వాశకోశ వ్యాదులంటారు. ఇందులో శ్వాస వ్యవస్థను ప్రభావితం చేసే వివిధ రకాల వ్యాధికారక పరిస్థితులను ముందుగా గుర్తించి తగిన మందులు వాడి అదుపు చేయాలి. లేకుంటే దీర్ఘకాలిక వ్యాధిగా మారే ప్రమాదం ఉంది.

ప్రశ్న: శ్వాసకోశ వ్యాదులు ఎన్ని రకాలు?

జ: శ్వాసకోస వ్యాదులు మూడు రకాలుగా విభజించారు. వాటిల్లో ఊపిరితిత్తుల కణజాల వ్యాదులు, వాయుమార్గవ్యాదులు, ఊపిరితిత్తుల ప్రసరణ వ్యాధులుగా ఉన్నాయి.

ప్రశ్న: శ్వాసకోశ వ్యాదులబారిన పడటానికి ఎటువంటి కారణాలున్నాయి?

జ: శ్వాసకోశ వ్యాధుల బారిన పడటానికి వివిధ రకాల కారణాలున్నాయి. వాటిల్లో ముఖ్యంగా ధూమపానం, పొగాకు నమలటం, వాయుకాలుష్యం, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం, విషపూరిత పొగ, ఇతర పదార్థాలకు అధికంగా బహిర్గతం కావడం, జన్యు శాస్త్రం, ఫంగల్, వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ఇలా పలు రకాలుగా చెప్పవచ్చు.

ప్రశ్న: శ్వాసకోశ వ్యాధుల బారినపడినవారిలో ఎటువంటి లక్షణాలుంటాయి?

జ: ఈ వ్యాధి బారిన పడినవారిలో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటం, గురక, నిరంతరం దగ్గు, ఛాతీ ప్రాంతంలో నొప్పి, కాలి, చేతి వేళ్లలో వాపు, గొంతు నొప్పి, వాపు, దగ్గుతో రక్తం, మాట్లాడటంలో మార్పు, అలసట వంటి లక్షణాలను ఎక్కువగా గమనించవచ్చు.

ప్రశ్న: దీర్ఘకాలిక వ్యాధిగా ఎలా నిర్ధారిస్తారు ?

జ: నెల అంతకంటే ఎక్కువ కాలం దగ్గుతున్నప్పుడు దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధిగా గుర్తిస్తాం. వీటిని ఛాతీ ఎక్స్‌రే, పల్మనరీ ఫంక్షన్ పరీక్షల ద్వారా నిర్ధారిస్తాం.

ప్రశ్న: వీటి నివారణకు ఎటువంటి చికిత్సలను అందిస్తారు ?

జ: శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు తగిన టీకాలను, మందులను వైద్యుల పర్యవేక్షణలో తీసుకోవాలి. పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలను పాటించాలి.



సమావేశంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ పవన్ కుమార్

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

● ఎంఎల్ఎస్ఏ చైర్మన్, మేజిస్ట్రేట్ ఆకా పవన్‌కుమార్

పొన్నూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయం కోసం రాజీ పడదగిన అన్ని కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మేజిస్ట్రేట్ ఆకా పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సివిల్ కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మేజిస్ట్రేట్ మాట్లాడుతూ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు రాజీ పడదగిన కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సులభతర పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు మొగుల్‌బేగ్, షేక్ బాజీసాహెబ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొందుగల జయరాజు తదితరులు పాల్గొన్నారు.



గోకులం షెడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

నిర్ణీత సమయంలో గోకులం షెడ్డులను పూర్తిచేయాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్డు నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం గ్రామాల్లో గోకులం షెడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. రైతులకు షెడ్డు నిర్మాణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గోకులం షెడ్డు నిర్మాణాలు పూర్తయిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతలు ప్రకారం గోకులం షెడ్డును నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, డీఆర్‌డీఏ టెక్నికల్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు

పొన్నూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించేందుకు తెలుగుదేశం పార్టీ ఏర్పాట్లు చేసింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఉదయం 8.15 గంటలకు చేబ్రోలు మండలంలోని నారాకోడూరు, 8.45కి వేజండ్ల, 9.10కి వడ్లమూడి అడ్డరోడ్డు, 9.25కి వడ్లమూడిలో, 9.50కి చేబ్రోలు, 10.30 గంటలకు పొన్నూరు పట్టణంలో జరిగే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పాల్గొన్నను నట్లు టీడీపీ నాయకులు శుక్ర వారం తెలిపారు.